# అలివేలు మొగుడు

– గుమ్మా నిత్యకళ్యాణమ్మ

సుమతీ శతకకారుడన్న మాట పొల్లుపోలేదు. 'సిరిదా వచ్చిన వచ్చున్ సలలితముగ నారికేళ సలిలము భంగిన్'. అలివేలు విషయంలో అది నిజమైంది.

అలివేలు పుట్టెడు కష్టాలలో వున్న కుటుంబంలో పుట్టింది. ఆమె తండ్రి సూరయ్య సైకిల్ రిక్షా తొక్కేవాడు. అతని భార్య అలివేలు పుట్టినప్పటి నుంచి మంచాన పడింది. తండ్రి సంపాదించిన డబ్బులు తెచ్చి ఇస్తేనే ఆ ఇంటిలో పొయ్యిలో పిల్లి లేచేది.

మంచికో చెడుకో తెలియదు కానీ, అలివేలు చిన్నప్పటి నుంచి కష్టాలకు అలవాటుపడింది. వంట వండడం, ఇంటిపని చెయ్యడం ఆమె వంతైంది. సూరయ్యకు పెళ్లాం సుఖం లేనందున మందుకి అలవాటుపడ్డాడు. ఇంటికి డబ్బు ఇచ్చేవాడు కాదు. అలివేలుకి బాధ్యతలు పెరిగిపోయాయి. పదవ ఏట నుంచే పాచిపని చేయడం, రోడ్ల వెంట తిరిగి పేడ తెచ్చి పిడకలు చేసి వాటిని అమ్మడం మొదలెట్టింది. ఆమెకు చదువుకోవాలని కోరికగా వున్నా చదువు చెప్పించే నాథుడేడి?

పాచి పనులు చేస్తూనే అ, ఆ లు నేర్చుకుంది. ఆ వెనుక గుణింతాలు, ఒకటవ తరగతి పుస్తకం రెండవ తరగతి వాచకం చదవడం నేర్చుకుంది.

కాలం దొర్లిపోతూ వుంటే అలివేలు యుక్తవయస్కురాలు అవడం, కన్నెప్రాయంలో ప్రవేశించడం జరిగాయి.

ఆమె ఈడు పిల్లలకు పెళ్లిళ్లు జరగడం, వాళ్లు పిల్లా పాపలతో కలకలలాడడం చూసి అసూయ చెందేది, దిగులుపడేది. తండ్రికి ఇంటి విషయాలే పట్టవు, తల్లి వున్నా లేనట్లే లెక్క.

మరి అలివేలుకి కళ్యాణం జరగడం ఎలా?

డబ్బు వున్న వాళ్లే కాదు, కూటికి లేని ఆడపిల్లలూ ఆ వయసులో ఆకాశ హర్మ్యాలు కట్టుకుంటారు. ఆ ఆశాసౌధాలు నిజమౌతాయా? అవి కలల వరకే పరిమితమా? అనేది విధి ముందుగా చెప్పదు.

రాజకుమారుడు లాంటి యువకుడు ఆమె స్వప్నాలలో రోజూ సాక్షాత్కరించేవాడు. ఆమె కలలలోనే పరవశురాలయ్యేది. నేటి తెలుగు సినిమాల్లో హీరోయిన్‌లా ఆమె ఆ కలల రాకుమారుడితో డ్యూయెట్లు పాడేది, స్టెప్స్ వేసేది.

పెళ్లి చేసుకుంటే అలాంటి వాడినే చేసుకోవాలి. తన కాబోయే భర్తకు పెద్ద చదువుండాలి, మంచి ఉద్యోగం వుండాలి, విశాలమైన ఇల్లు వుండాలి, ఒంటినిండా బంగారం, పట్టుచీరలు.

అలివేలుకు అంతకు మించి కోరికలు లేవు.

'చాల్లే! మనమేం లక్షాధికారులమా? అలాంటి సంబంధం చేయడానికి మనకు తాహతేది? మీ అయ్యకసలే ఇంటి పొడకిట్టదు. నువ్వే తెగించి ఏ రిక్షావాడినో కట్టుకో. లేదన్నావు కూలీనాలి చేసుకు బ్రతికేవాడిని చేసుకో. నీ పెళ్లి నీ అయ్య చేస్తాడని ఆశపడకు' అని హెచ్చరించేది అలివేలు తల్లి.

కాలం కలిసొస్తే నడిచొచ్చే కొడుకు అంటారు.

చలాకీగా తిరిగే ఈ పిల్ల మీద పరంధామయ్య కన్ను పడింది. అతనికో కొడుకున్నాడు. చదువు సంధ్యలు లేవు గానీ ఇరవై రెండేళ్ల వయసుంది. జులాయిగా తిరుగుతాడు. వాడికో ముక్కుతాడు వుంటేనే కానీ వాడు దారిలోకి రాడు అని పరంధామయ్యకు తెలుసు.

తాటిచెట్టులా ఏపుగా పెరిగి గడ్డాలూ, మీసాలూ వచ్చినా వాడికి పిల్లనిస్తాం అంటూ ఎవరూ రావటం లేదు. కొడుక్కి పెళ్లి కాదేమోననే బెంగ పరంధామయ్యను వేధించసాగింది. పరంధామయ్యకు పెద్దగా ఆస్తులు లేవు. విశాలమైన పెరడు, ఆవరణలతో ఓ పూరిల్లు



వుంది. అది తాత తండ్రుల నుండి సంక్రమించినది. తను గుటుక్కుమంటే ఆ స్థలాన్ని, ఇంటిని తన సుపుత్రుడు అమ్మి చివరకు జోడే కాదు నీడలేని వాడౌతాడు కూడా.

మొదటి చూపులోనే అలివేలు పరంధామయ్యను ఆకర్షించింది.

ఈ పిల్లను తన కొడుక్కి కట్టబెడితే ఇది సంపాదించి వాడిని పోషించగలదు అనుకున్నాడతను.

ఒకరోజు పనిగట్టుకుని ఆ పిల్లను కలుసుకున్నాడు.

'ఏ పిల్లా!' అన్నాడు.

'నా పేరు పిల్ల కాదు. అలివేలు మంగతాయారు' అంది. ఎందుకు పిలిచావన్నట్లు చూసింది.

'నాది చల్లకొచ్చి ముంత దాచే పద్ధతి కాదు. నిన్ను కోడలు పిల్లా అని పిలవాలని మనసుగా వుంది. నీకిష్టమేనా?' అడిగాడు పరంధామయ్య.

'మా ఇంట్లో అంట్లు తోమడానికి, బట్టలుతకడానికి వస్తావా' అని అడుగుతాడని ఆశపడింది. మరో ఇంట్లో పని దొరికితే మరో వందో, వందా యాభయ్యో అదనంగా దొరుకుతాయి. అతనా ప్రశ్న వేస్తే తుళ్లిపడింది, అంతలోనే ఆనందపడింది. నేటి సినిమా హీరోయిన్‌లా అక్కడే కలల్లోకి జారిపోయింది. ఆమె మనసులో పెళ్లి బాజాలు మ్రోగాయి. అలా అరక్షణం నిశ్చేష్ఠ అయి నిలుచుండిపోయింది. ఆ తరువాత ఆమె తిరిగి ఈ లోకంలో పడింది.

'కోడలు పిల్లా అని వరసకు పిలవాలను కుంటున్నారా, లేక నిజంగానే మీ కోడల్ని చేసుకోవాలనుకుంటున్నారా?'

'ఆ రెండోదే ఖాయం చేయాలను కుంటున్నాను' ముసిముసిగా నవ్వుతూ అన్నాడు.

అలివేలు ముగ్ధ అయి సిగ్గుపడలేదు. 'మా తల్లిదండ్రులను సంప్రదించండి' అని అనలేదు. వాళ్లు పూనుకొని తన పెళ్లి చేస్తారన్న నమ్మకం ఏనాడో పోయింది. తల్లి హెచ్చరించనే హెచ్చరించింది– నీ మొగుణ్ణి నువ్వే వెతుక్కో అని.

'ఇంకాస్త వివరాలు చెప్తారా?' అంది వినయాన్ని ఒలకబోస్తూ.

పరంధామయ్య అన్నీ చెప్పాడు. తను అట్టే కాలం బ్రతకబోడన్నాడు.

'మీ అబ్బాయికి చదువు లేదు, ఉద్యోగం లేదు. మరి పెళ్లాం పిల్లల్ని ఎలా పోషిస్తాడు? నేను పస్తులుండి చావాలని మీరు కోరుకుంటున్నారా?' నిలదీసింది.

'కోపగించుకోకు. నువ్వు నా కొడుకును దారిలో పెట్టగలవన్న నమ్మకం నాకుంది. నువ్వు గీసిన గీతను దాటడు. అలాంటి అర్భకుడు వాడు.'

అలివేలుకి నిజంగా కోపమొచ్చింది. తనలాంటి భర్త కావాలని కలలు కంటున్నది. ఈ పద్దెనిమిదేళ్లలో కటిక దారిద్ర్యాన్నే చవిచూసింది, కష్టాలనే అనుభవిస్తున్నది. కోరి ఇలాంటి వాడిని కట్టుకుంటే తన గతేం కాను? తా దూర సందులేదు. మెడకో డోలా? ఇది మగవాళ్లకే కాదు, ఆడవాళ్లకూ వర్తిస్తుంది.

అలివేలు మరో మాట చెప్పకుండా వెళ్లిపోయింది.

ఆ సంఘటన జరిగి వారం తిరిగింది.

ఈ వారంలో అలివేలు మరికొన్ని కొత్త కష్టాలను చవిచూసింది.

అలివేలు తల్లి లేనిదైంది.

పిటపిటలాడే యవ్వనంలో వున్న ఆమెను చాలామంది తినేసేలా చూస్తున్నారు. కొందరైతే ఒంటిమీద చెయ్యి వేసి మోటు సరసాలు కూడా చేశారు.

ఆడదానికి రక్షణ అవసరమని అలివేలుకి అప్పుడనిపించింది.

యుక్త వయసులో వున్న స్త్రీకి దాంపత్య జీవితం, మాతృత్వం అంతే అవసరమని తెలిసింది.

అలివేలు పరంధామయ్య ఇల్లు వెతుక్కుంటూ వెళ్లింది.

'రా! కోడలు పిల్లా! నీవు ఇలా వచ్చేవంటే నీ మనసు మార్చుకున్నా వన్నమాట' ఆప్యాయంగా పలకరించాడు.

'మీకు లంకంత కొంప వుంది. ఎలాగో అప్పో సప్పో చేసి నాలుగు గేదెలు కొంటాను. పాలూ నీళ్లూ అమ్ముకుని మేం బ్రతకలేకపోం. మీ అబ్బాయిని నేను చేసుకుంటాను' అంది సిగ్గును ఓ మూల విసిరేసి.

పరంధామయ్య పరమానంద భరితుడయ్యాడు.

అలివేలు పెళ్లి చేసుకున్న అబ్బాయి పేరు సుబ్బారావు. కొంతకాలానికి ఆ పేరు మరుగునపడి అలివేలు మొగుడయ్యాడు.

పురుషాధిక్య ప్రపంచం అంటారు. అలివేలు సంసారం చూసిన వాళ్లు తమది తప్పని గ్రహిస్తారు. అలివేలు మొగుడికి నోట్లో నాలుక లేదు. పెళ్లాం ఎంత చెప్తే అంత. సంసార శకటం నల్లేరు మీద బండిలా నడవాలంటే ఆలూమగల్లో ఏ ఒక్కరిదో పైచేయి అయి వుండాలి.

అలివేలు పాల వ్యాపారం బాగానే సాగుతోంది. మొగుడికి పాలు పితకడం నేర్పింది. పశువులకు దాణా ఎప్పుడు ఎంత వేయాలో నేర్పింది.

'అలివేలూ! ఆ పాలు నేను పంచి ఇస్తాను. నీకెందుకు శ్రమ' అంటాడు అలివేలు మొగుడు.

అలివేలు అందుకిష్టపడేది కాదు. అతడా పని చేస్తే తన వ్యాపారం బండారం బయటపడుతుంది.

'బొత్తిగా నీళ్లు పోస్తున్నారు. ఇలాగైతే మాకు మీ పాలు అక్కరలేదు' అని ఎవరైనా అంటే 'అబ్బే బొత్తిగా నీళ్లు పోయడం లేదండి, లీటరు పాలకు రెండు లీటర్ల నీళ్లు కలుపుతుంది మా ఆవిడ' అంటూ నిజం కక్కేస్తాడు. నిజం ఎప్పుడు, ఎలా దాచాలో ఆ వెర్రిబాగుల వాడికేం తెలుసు?

'నువ్వా పనికి పూనుకుంటే మన పాల వ్యాపారం రెండు రోజుల్లో అటకెక్కుతుంది. నా తిప్పలేవో నేను పడతాను. నిన్ను కట్టుకున్నాక నాకు తప్పుతుందా?'

పాలు బొత్తిగా పలుచగా వుంటున్నాయి అని అందరూ అలివేలుతో అంటూ వుంటారు.

'అయ్యో! ఎవరికైనా పాలలో దోసెడు నీళ్లు కలుపుతాం కానీ మీకు అప్పుడే పితికిన గేదెపాలు చిక్కటివి ఇస్తున్నాను' అంటుంది. ఈ దేశవాళీ గేదెలు నీళ్లెక్కువ తాగుతున్నాయి. పంజాబు గేదెను కొంటాను అంటూ అందరికీ సమాధానాలు చెబుతూ వుంటుంది. అయితే అలివేలుకో కిటుకు తెలుసు. తలా ఒకరోజూ అందరికీ చిక్కటి పాలు పోస్తుంది.

'ఏమమ్మా! నిన్న పాలు పేరు చెప్పి నీళ్లు పోసి వెళ్లిపోయావు?'

'అయ్యో! నిన్న పొరపాటు

జరిగిపోయిందమ్మా! మీరందరూ లీటరుకి పద్నాలుగు రూపాయలిస్తున్నారా? ఆ సీతమ్మగారు పదికి ఎక్కువ ఇవ్వనంటుంది. నాలుగేళ్ల క్రితం ఏ రేటు వుందో అదే ఇస్తానంటుంది. ఇప్పుడెలా కుదురుతుంది? గేదెల ధరలు పెరిగిపోయాయి. గడ్డి, చిట్టూ, తవుడూ, పిండీ అన్నిటి ధరలు పెరిగాయి. అందుకే చెప్పొద్దూ ఆమెకిచ్చే పాలలో నీళ్లు కలుపుతాం. పొరపాటున ఆ పాలు మీకిచ్చి వుంటాను. ఈ నెల మొత్తం డబ్బులో రెండు రూపాయలు కొట్టేయండి' అంటుంది అలివేలు నేర్పుగా.

ఇంత శ్రమిస్తున్నా, మోసం చేస్తున్నా అలివేలు కలలు పండలేదు. రాబడికి మించిన ఖర్చులు, ఆమె ఆశాసౌధాలు అలాగే వుండిపోయాయి.

బెల్లానికి చీమల్ని వెతుక్కుంటూ వెళ్లవలసిన అవసరం లేదు. చీమలే తమంతట తాము బెల్లం దగ్గరకు వస్తాయి.

అలివేలు మంగతాయారు విషయంలో అదే జరిగింది.

పట్టణాలలో ఇళ్ల కొరత బాగా ఏర్పడింది. విస్తరించి వున్న పాత ఇళ్లను పడగొట్టి నాలుగంతస్తుల అపార్టుమెంటులను నిర్మిస్తున్నారు. అదొక పెద్ద వ్యాపారమైంది. అలివేలుది పూరిల్లు అయినా వెనక చాలా ప్రదేశం వుంది. ఒక బిల్డరు కన్ను పడింది. ఆ స్థలాన్ని తనకమ్మితే లక్ష రూపాయల నగదు, ఒక ఫ్లాటు ఇస్తానన్నాడు. అలివేలుకది లాభసాటిగా కనిపించింది. అయినా అతడు చెప్పిందే బేరమా? రెండు లక్షలు, రెండు ఫ్లాట్లు- అంతకు తక్కువకు తను అమ్మనంది. చివరకు లక్షా డైబ్బై అయిదు వేలు, రెండవ అంతస్తులో ఒక భాగం, నాలుగవ అంతస్తులో మరో భాగం ఇవ్వడానికి అతను అంగీకరించాడు.

తాత్కాలికంగా అలివేలు ఎవరో అద్దె ఇంటిలోనికి మారింది. ఇక్కడ గేదెలు కట్టడానికి స్థలం లేదు. అందుకే గేదెలను అమ్మేసింది. పాల వ్యాపారం ఎత్తిపెట్టడం ఆమె ఉద్దేశ్యం కాదు. చుట్టుపక్కల గ్రామాలలో పాలను కొని సేకరించి, ప్యాకెట్లు కట్టి అమ్మకం మొదలెట్టింది. అలివేలు మొగుడు ఉదయం మూడు ఖాళీ కేనులతో వెళ్లి వాటి నిండుగా పాలు తీసుకుని వస్తాడు. అలివేలు ఫ్రిజ్ కూడా కొన్నది. ఆమె వ్యాపారం మరింత పుంజుకుంది. నీళ్ల మీద వచ్చే ఆదాయం తిండికి, పాల మీద వచ్చే ఆదాయం బ్యాంకుకి.

ఏడాది తిరిగేసరికి అపార్టుమెంటులు తయారయ్యాయి. రెండో అంతస్తులోనికి తన బస మార్చింది. నాలుగో అంతస్తులోని భాగాన్ని అద్దెకిచ్చింది.

అలివేలు మంగతాయారు దగ్గర ఇప్పుడు డబ్బూ, నగలూ పుష్కలంగా వున్నాయి. కానీ భార్యాభర్తల దగ్గర లేనివి డిగ్రీలు. ఆ అపార్టుమెంటులో ప్రతీ ఇంటిముందూ ఓ బోర్డు వుంది. అలాంటి బోర్డు లేనిది అలివేలు ఇంటిముందే.

అలాంటి బోర్డు లేకపోవడం ఆమెకు చిన్నతనంగా వుంది.

'నువ్వూ నీ పేర్న ఓ బోర్డు రాయించి పెట్టు' అలివేలు భర్తతో అంది.

'వాళ్లంటే డాక్టర్లు, ఇంజనీర్లు, ఎం.ఏ.లూ, బి.ఏ.లూ. నాకు చదువా చట్టుబండలా. అంత మక్కువగా వుంటే అలివేలు మంగతాయారు అన్న బోర్డు రాయిస్తాను' అన్నాడు అలివేలు మొగుడు.

అలివేలుకి అనుకున్నది సాధిస్తేనే కానీ నిద్రపట్టదు. దీర్ఘంగా ఆలోచించింది.

మూడో రోజున ఇంటిముందు ఓ బోర్డు వెలిసింది.

బి.సుబ్బారావు

హెచ్.ఓ.ఏ.ఎం.టి.

'అలివేలూ! అదేమిటి ఓనమాలే రాని నీకు, నా పేరు కింద ఆ డిగ్రీ ఏమిటి? అలా దొంగ డిగ్రీలు పెట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి కేసు పెడతారు. ఆ బోర్డు తీసేయి' అరచినంత పని చేశాడు అలివేలు మొగుడు.

'నీకా చింత ఎందుకు? దాని అర్థం ఏమిటో నీకు తెలుసా?' అంది.

'నాకు తెలియదు'

'హజ్బెండ్ ఆఫ్ అలివేలు మంగ తాయారు. అందులో మోసం ఏముంది?'

ఆ అపార్టుమెంటులో వున్న వారికి చాలాకాలం వరకు సుబ్బారావు ఏం చదివాడో, ఆ డిగ్రీని ఏ విదేశపు యూనివర్సిటీ ఇచ్చిందో అర్థం కాలేదు. ○